

నర్స్.. అమ్మ

ప్రభుత్వ ఆస్పత్రుల్లోని నర్సులు నిస్వార్థ సేవకు ప్రతిరూపంగా నిలుస్తున్నారు. ఎన్ని కష్టాలు ఉన్నా మోములో చెరగని చిరునవ్వుతో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. 10లో▸



వైద్యసేవలు మెరుగుపర్చాలి

ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు మరింత మెరుగు పర్చాలని డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు అన్నారు. రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
42.0 /26.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రత పెరిగి ఎండలు మరింతగా పెరిగే అవకాశం ఉంది. వడగాలులు వీస్తాయి.

అడ్డగోలుగా వెంచర్లు !

జిల్లా పరిధిలో జాతీయ రహదారుల నిర్మాణం మొదలైనప్పటి నుంచి శివారు ప్రాంతాల భూముల ధర అమాంతం పెరిగిపోయింది. రహదారికి ఆనుకుని ఉన్న భూములతోపాటు సమీప గ్రామాల్లో స్థలాలకూ భారీగా డిమాండ్ ఏర్పడింది. దీంతో సాగు భూములను కొనుగోలు చేస్తూ ఓపెన్‌ప్లాట్లు, ఫాం ల్యాండ్స్ పేరుతో రియల్ వ్యాపారం చేస్తున్నారు. పట్టణాల్లో భూములు అందుబాటులో లేకపోవడం, ఉన్నచోటా ధరలు విపరీతంగా పెరగడంతో శివారు ప్రాంతాల్లో రియల్ వ్యాపారం అధికంగా సాగుతోంది.



బెల్లంపల్లి మండలం దుగ్నేపల్లిలో వెలిసిన ఈ వెంచర్‌లో కొంత వరకే అనుమతి ఉంది

- చాలా చోట్ల అనుమతి లేకుండానే వ్యాపారం
- ప్రచారంలోనే డీటీసీపీ లే అవుట్
- కొన్ని అసైన్డ్ జాగాల్లోనూ ఓపెన్ ప్లాట్లు
- జాతీయ రహదారులతో విలువ పెంపు



కాసిపేట: పెద్దనపల్లిలో రహదారిని ఆనుకుని..



హాజీపూర్: సబ్బెపల్లిలో అనుమతులు లేకుండానే..

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: స్థిరాస్తి వ్యాపారంలో చాలా చోట్ల అనుమతులు లేకుండానే సాగుతున్నాయి. లే అవుట్ పేరు చెప్పి కొనుగోలుదారులను బురిడీ కొట్టిస్తున్నారు. మొదట అన్ని రకాల ఆమోదం ఉందని చెబుతున్నారు. కానీ మొత్తం లే అవుట్‌లో కొంతమేర అనుమతి తీసుకోవడం, కొన్ని చోట్ల దరఖాస్తు దశలో ఉండగానే అమ్మేయడం చేస్తున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని ఓ రియల్ వ్యాపారి అమ్మిన ప్లాట్ల వ్యవహారంలో గొడవలు వచ్చాయి. పోలీసుస్టేషన్ వరకు ఫిర్యాదులు వెళ్లాయి. పాత మంచిర్యాల శివారులో ఓ వెంచరులో రెండెకరాల అసైన్డ్ భూమిని సైతం కలిపేసి లే అవుట్‌గా చెబుతూ విక్రయిస్తున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, అన్ని సౌకర్యాలు కల్పించకున్నా కొనుగోలు పూర్తయ్యే వరకు అన్ని ఏర్పాట్లు చేస్తామని ముందస్తుగానే బుకింగ్స్ చేయిస్తున్నారు. నిబంధనలు పూర్తి స్థాయిలో ఎక్కడా అమలు కావడం లేదు.

జాతీయ రహదారుల వెంట

రాజీవ్ రహదారి 363 జాతీయ రహదారిగా మారడంతో గోదావరి ఒడ్డున జైపూర్ మండలం ఇందారం నుంచి తాండూరు మండలం రేపల్లెవాడ దాకా పుట్టగొడుగుల్లా వెంచర్లు ఏర్పాటయ్యాయి. ఇందారం, రామారావుపేట, నుంచి నస్పూర్ పట్టణ పరిధి, జిల్లా కేంద్రం, క్యాతనపల్లి, మందమర్రి మండలం, సోమగూడెం, బెల్లంపల్లి పట్టణ శివారు, కన్నాల, రేచినీ, తాండూర్ మండలం వరకు శివారు గ్రామాల్లో ఓపెన్‌ప్లాట్లతో రియల్ వ్యాపారం నడుస్తోంది. జైపూర్ థర్మల్‌ప్లాంట్ చుట్టూ ఉన్న రసూల్‌పల్లి, టేకుమట్ల, నర్వా, పెగడపల్లి, షెట్‌పల్లి, భీమారం, చెన్నూరు పట్టణ శివారులో, కోటపల్లి మండలం మహారాష్ట్ర సరిహద్దు వరకు భూములకు విలువ పెరిగింది. తాండూరు నుంచి కాగజ్‌నగర్ మీదుగా గడ్చిరోలి వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వే మొదలకాక ముందే స్థిరాస్తి వ్యాపారులు అక్కడి భూములు కొనుగోలు చేసి ధరలు పెంచేశారు. ఇక జైపూర్ మండలం నర్వా నుంచి మంథని మీదుగా వరంగల్ వెళ్లే ఎన్‌హెచ్-163జీ గ్రీన్‌ఫీల్డ్ హైవే మంజూరైనప్పటి నుంచే ఇక్కడ సాగు భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఈ గ్రామాల శివార్లలోనూ క్రయవిక్రయాలు సాగుతున్నాయి. నిజామాబాద్ నుంచి జగ్దల్‌పూర్ జాతీయ రహదారి మంజూరైనప్పటి నుంచి లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లోని ప్రధాన రహదారికి ఉన్న భూముల ధరలు మరింత పెరిగాయి. ఇటీవల అలైన్‌మెంట్ ఖరారై, రోడ్డు విస్తరణ పెరగడం, మెడికల్ కాలేజీ సైతం గుడిపేటలో ఏర్పాటు కావడంతో ఆ చుట్టుపక్కల శివారు ప్రాంతాలకు డిమాండ్ పెరిగింది. పాత మంచిర్యాల శివారు మొదలు వేంపల్లి, ముల్కల, గుడిపేట, హాజీపూర్, లక్సెట్టిపేట మండలం ఇటిక్యాల్, ఊత్కూర్ ఎక్స్‌రోడ్ వరకు దారులకు ఇరువైపుల నివాస ప్రాంతాల ఆనుకునే వెంచర్లు వెలిశాయి. దండేపల్లి, జన్నారం ప్రధాన రోడ్డు వెంట ప్లాట్లు చేశారు. చాలాచోట్ల కనీస అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు.

గ్రామాల్లోనూ రియల్ దందా

మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు, పట్టణానికి ఆనుకుని ఉన్న గ్రామాల్లోనూ రియల్ వ్యాపారం నడుస్తోంది. ఎటువంటి అనుమతులు లేకుండా జరుగుతున్నాయి. కనీసం నాలా అనుమతి లేకుండానే ప్లాట్లను గుంటల చొప్పున అమ్మేస్తున్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గాలు, అధికారులు ఫిర్యాదులు వచ్చిన చోట మాత్రమే బోర్డులు వేస్తున్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా



మాట్లాడుతున్న కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎలాంటి పొరపాట్లు లేకుండా ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌తో కలిసి మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు వేణు, శ్యామలాదేవి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది జనవరి 5 నుంచి ఈ ఏడాది జనవరి 5వరకు జిల్లాలో 15,459 మంది ఓటు హక్కు నమోదు చేసుకున్నారని తెలిపారు. ఓటర్ల తొలగింపులో పొరపాట్లు లేకుండా అధికారులు మరోసారి పరిశీలించాలని తెలిపారు.

మిల్లర్లు లక్ష్యాలను పూర్తి చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో రైస్‌మిల్లర్లకు కేటాయించిన నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌తో కలిసి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్‌మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 30,400 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, మిగతా లక్ష్యాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గతేడాది సీఎంఆర్ ప్రక్రియ ఈ నెల 20లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పౌర సరఫరాల శాఖకు కేటాయించిన లక్ష్యాన్ని మూడు రోజుల్లోగా పూర్తి చేయాలని, ఎఫ్‌సీఐకు కేటాయించిన కోటా ఈ నెల 20లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, రైస్‌మిల్లర్లు ధాన్యంలో కోతలు లేకుండా మిల్లుల్లో దిగుమతి చేసుకోవాలని తెలిపారు. జిల్లా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కాంతయ్య పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకునేందుకు..

మంచిర్యాలఅగ్రికల్చర్: పర్యావరణాన్ని కాపాడుకుంటూ సహజ వనరులను పొదుపుగా వినియోగిస్తూ ముందు తరాలకు అందిద్దామని కలెక్టర్ సంతోష్ అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర కాలుష్య నియంత్రణ సంస్థ రూపొందించిన లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కాలుష్య నియంత్రణ బోర్డు అనలైజిస్ట్ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ప్రజల రక్షణకు అహర్నిశలు కృషి

- సీపీ రెమా రాజేశ్వరి
- అధికారులు, సిబ్బందికి రివార్డులు



రివార్డు అందుకుంటున్న డీసీపీ సుధీర్

మంచిర్యాలక్రైం: ప్రజలకు రక్షణ కల్పించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది అహర్నిశలు కృషి చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీస్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, సరికొత్త వ్యూహరచనపై అధికారులతో చర్చించారు. కమిషనరేట్ పరిధిలో విధి నిర్వహణ, అత్యుత్తమ సేవలు అందించిన 500 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి రివార్డులు అందజేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో కచ్చితంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎస్సైలు కృషి చేయాలని అన్నారు. కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో గత రెండు నెలల్లో 648 గ్రామాలు, 110 ఆమ్లేట్ గ్రామాల్లో 2,978 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు సుధీర్‌రాంనాథ్ కేకన్, వైభవ్ గైక్వాడ్, ఏఆర్ అడిషనల్ డీసీపీ రియాజ్‌ఫుల్ హక్, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

నిరుద్యోగులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలఅర్బన్: నిరుద్యోగులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు అన్నారు. గురువారం శ్రీహర్ష కళాశాలలో తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ అకాడమీ(టాస్క్) సహకారంతో చైర్మన్ పల్లె భూమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేగా జాబ్‌మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కేటీఆర్ కృషితో లక్షలాది ఉద్యోగాలు లభిస్తున్నాయని, హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా మార్చేందుకు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. జాబ్‌మేళాకు 720 మంది హాజరుకాగా 311 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో టాస్క్ ఇంచార్జీ దీప, కౌన్సిలర్ మీనాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ నల్ల శంకర్, బీసీ సెల్ నాయకుడు గొంగ్ల శంకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎండీ ఖాజామియా తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథాలయ పునర్నిర్మాణానికి సీఎం సుముఖత



మ్యాప్‌ను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలఅర్బన్: శిథిలావస్థలో ఉన్న విశ్వనాథస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి సీఎం కే.చంద్రశేఖర్‌రావు సుముఖత వ్యక్తం చేసినట్లు మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు వెల్లడించారు. గురువారం ఆయన స్థానిక విశ్వనాథ ఆలయం ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. విశ్వనాథ దేవస్థాన ప్రాంగణంలో శిథిల ఆలయాల పునర్నిర్మాణానికి దేవదాయ, ధర్మదాయశాఖ అధికారులు అంచనాలు రూపొందించారని, సీఎం కలిస్తే రూ.1.97కోట్లు మంజూరుకు సానుకూలత వ్యక్తం చేశారని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, కౌన్సిలర్ మాదంశెట్టి సత్యనారాయణ, ఈవో ముక్తా రవి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ చందూరి పురుషోత్తం పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్‌హెచ్-63 బాధితుల దీక్ష

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల-ఆర్మూర్ నాలుగు వరసల జాతీయ రహదారి-63 నిర్మాణ పనుల్లో భాగంగా సర్వేను అడ్డుకుంటూ ఎన్‌హెచ్-63 బాధితులు ముల్కల్లలో చేపట్టిన నిరసన దీక్ష కొనసాగుతోంది. గురువారం ఎన్‌హెచ్ఏఐ మేనేజర్ సంతోష్, టెక్నికల్ అధికారి, తహసీల్దార్ రాజలింగు, మండల సర్వేయర్ కృష్ణప్రియ దీక్ష శిబిరాన్ని సందర్శించి బాధితులతో సంప్రదింపులు జరిపారు. విలువైన భూములు, ఇళ్లు కోల్పోతున్నామని, రహదారి విస్తరణ ప్రణాళిక మార్చాలని డిమాండ్ చేశారు. గుట్ట పక్క, గోదావరి తీరప్రాంతం మీదుగా జరిగేలా పరిశీలించాలని అన్నారు. బాధితుల సూచనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు. కాగా, దీక్ష శిబిరాన్ని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు సందర్శించి సంఘీభావం తెలిపారు.

గ్రంథాలయాల్లో ఖాళీల జాతర



మంచిర్యాలలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం

- రెండేళ్లుగా ఇంచార్జీలే దిక్కు
- భర్తీపై పట్టించుకోని ప్రభుత్వం

దండేపల్లి: గ్రామీణ యువత ఏ పోటీ పరీక్షలు రాయాలన్నా గ్రంథాలయాల్లోనే సన్నద్ధం అవుతుంటారు. కానీ గ్రంథాలయాల్లో నిర్వాహకులు లేక ఇన్‌చార్జీలతో కాలం వెళ్లదీస్తుండడంతో నిరుద్యోగ అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో లైబ్రేరియన్‌కు రెండు మూడు గ్రంథాలయాల బాధ్యతలు అప్పగించడంతో విధులు నిర్వర్తించడం ఇబ్బందిగా మారుతోంది. దీంతో నిర్వహణ మొక్కుబడిగా సాగుతోంది. రెండేళ్లుగా ఖాళీలు భర్తీకి నోచుకోవడం లేదు. జిల్లాలో 14 గ్రంథాలయాలు ఉన్నాయి. వీటిలో 11 రెగ్యులర్ పోస్టులకు ఆరుగురు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు, ఒకరు ఔట్ సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్నారు. ఈ ఆరుగురిని నలుగురికి వారు చేసే పనితోపాటు రెండు మూడు చొప్పున అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో రెండు మూడు చోట్ల విధులు నిర్వర్తించడం లైబ్రేరియన్‌లకు తలనొప్పిగా మారింది. వారంలో ఒక చోట రెండ్రోజులు, మరోచోట రెండ్రోజులు పని చేస్తున్నారు. మిగతా రోజుల్లో స్వీపర్లు, పార్ట్‌టైం వర్కర్లు మాత్రమే గ్రంథాలయాలను తెరుస్తున్నారు.

ఇష్టారాజ్యంగా ఇన్‌చార్జీ బాధ్యతలు

ఇన్‌చార్జీల బాధ్యతలు అప్పగించడంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. జన్నారంలో పని చేసే లైబ్రేరియన్‌కు మంచిర్యాల, కోటపల్లి, వేమనపల్లి బాధ్యతలు అప్పగించారు. విధులు నిర్వర్తించే చోటు నుంచి అదనపు బాధ్యతలు నిర్వర్తించే గ్రంథాలయాలు సుమారు 120 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో విధులు ఎలా నిర్వహిస్తాడో అధికారులకే తెలియాలి. సమీపంలోని వారికే బాధ్యతలు అప్పగించాల్సి ఉండగా.. దూరప్రాంతాల వారికి అప్పగింతలో ఆంతర్యమేమిటో తెలియడం లేదు.

20 ఏళ్లుగా నియామకాల్లేవు..

లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి గత 20 ఏళ్లుగా ఎలాంటి నోటిఫికేషన్లు వెలువడలేదు. 1993 తర్వాత నుంచి ఎలాంటి నోటిఫికేషన్ వేయలేదు. 1999లో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో కొన్నింటిని భర్తీ చేశారు. చాలా చోట్ల పోస్టులు లేక ఖాళీలు, లేదంటే ఇంచార్జీలతో కాలం వెళ్లదీస్తున్నారు.

త్వరలో భర్తీ

లైబ్రేరియన్ పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఖాళీలపై ప్రభుత్వానికి వివరాలు పంపించాం. ఇబ్బందులు తొలగించేందుకు లైబ్రేరియన్ సెస్ ద్వారా ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమిస్తామని చెబితే ప్రభుత్వం అనుమతివ్వడం లేదు. త్వరలో పోస్టులు భర్తీ చేసే అవకాశం ఉంది.

– రాజు, జిల్లా గ్రంథాలయ ఇంచార్జీ కార్యదర్శి

ఇంచార్జీలు ఇలా..

జన్నారం లైబ్రేరియన్‌కు అదనంగా మంచిర్యాల, కోటపల్లి, వేమనపల్లి అప్పగించారు. జైపూర్ లైబ్రేరియన్‌కు చెన్నూరు, తాండూర్ లైబ్రేరియన్‌కు లక్సెట్టిపేట, మందమర్రి లైబ్రేరియన్‌కు నెన్నెల, భీమినిలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో, భీమారంలో పార్ట్‌టైం వర్కర్ విధులు నిర్వహిస్తున్నారు.

రశీదు పుస్తకాల మాయంపై చర్యలేవి..?

- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల చేతివాటం
- పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- సీడీఎంఏ నుంచి మున్సిపల్ సిబ్బందికి మెమోలు



మున్సిపాలిటీలో ఆడిటింగ్ చేస్తున్న అధికారులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో వివిధ రకాల పన్నుల వసూళ్లకు ఇచ్చే రశీదు పుస్తకాలు మాయమై మూడేళ్లు కావస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలు తావిస్తోంది. 2021లో జరిగిన ఆడిటింగ్‌లో పలు రశీదు పుస్తకాలు కన్పించకపోవడంపై ఆరా తీయగా ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మున్సిపల్ కార్యాలయంలో అప్పగించకుండా డబ్బులు సొంతానికి వాడుకున్నట్లు బయటపడింది. 2020 మార్చిలో వసూలు చేసిన వివిధ రకాల పన్నుల బిల్లులను సొంతానికి వాడుకోగా, ఏడాది తర్వాత ఆడిటింగ్‌లో వెలుగు చూడడంతో రశీదు పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. వారి నుంచి డబ్బుల రికవరీకి ప్రయత్నించగా ఒక ఉద్యోగి రశీదు పుస్తకాలు ఇచ్చి డబ్బులు చెల్లించగా, మరో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కనిపించకుండా పోవడంతో ఇప్పటికీ రశీదు పుస్తకాలకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి మున్సిపల్ అకౌంటింగ్ సిబ్బందికి, బిల్ కలెక్టర్లకు మెమోలు వస్తున్నాయి. ప్రస్తుతం 2022–23కు సంబంధించిన ఆడిటింగ్ మున్సిపల్ కార్యాలయంలో చేపడుతుండగా.. రశీదు పుస్తకాల మాయంకు సంబంధించి 2021లో ఉన్నట్లుగానే ప్రస్తుతం ఉండడంపై ఆడిటింగ్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం.

ఎవరిపై వేటు పడేనో..?

ఆస్తి పన్ను, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్‌ల ఫీజుల వసూలుకు 2020 మార్చిలో శాశ్వత ఉద్యోగులతోపాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రశీదు పుస్తకాలను మున్సిపల్ అధికారులు అందించారు. శాశ్వత ఉద్యోగులకు మాత్రమే రశీదు పుస్తకాలు ఇవ్వాలన్న నిబంధనను బేఖాతరు చేశారు. ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒక్కో దాంట్లో వంద రశీదులు ఉన్న మూడు పుస్తకాలు అప్పగించారు. వసూలు చేసిన బిల్లులు, రశీదులను అదేరోజు సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు అప్పగించాల్సి ఉంటుంది. పన్ను బకాయిలపై అందరూ దృష్టి సారించడం, వసూలు చేసిన డబ్బులు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అవకాశంగా మార్చుకున్నారు. వివిధ రకాల పన్నులు దాదాపుగా రూ.12 లక్షలకు పైగా వసూలు చేసినట్లు సమాచారం. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సిహెచ్.నరేశ్, రాజ్‌కుమార్ వసూలు చేసిన డబ్బులు, రశీదులను వారి వద్దనే ఉంచుకున్నారు. ఆడిటింగ్ సమయంలో వెలుగు చూసే వరకు అధికారులు దృష్టి సారించక పోవడం గమనార్హం. విషయం బయటకు పొక్కడంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అకౌంటెంట్, అప్పటి మేనేజర్‌కు మెమోలు జారీ చేయడంతోపాటు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు నిలిపివేశారు. రాజ్‌కుమార్ వసూలు చేసిన బిల్లులు, రశీదులను కార్యాలయంలో సమర్పించగా, నరేశ్ మెమోలకు స్పందించక పోగా కనిపించకుండా పోయాడు. మున్సిపల్ అధికారుల ఫిర్యాదు మేరకు అతడిపై పోలీసు కేసు నమోదైంది. ఇప్పటికీ నరేశ్ వద్ద ఉన్న రశీదు పుస్తకాలు, వసూలు చేసిన డబ్బులు మున్సిపాలిటీకి అప్పగించలేదు. దీంతో అకౌంటెంట్ సిబ్బందికి సీడీఎంఏ నుంచి ఇటీవల మెమోలు రావడం, ఉన్నతాధికారులు మరికొద్ది రోజుల్లో కార్యాలయానికి వచ్చి పరిశీలించనున్నట్లు సమాచారం. దీంతో ఎవరిపై చర్యలు తీసుకుంటారోనని, ఎవరిపై వేటు పడుతుందోననే చర్చ సాగుతోంది.

పోటాపోటీగా మధ్యాహ్న భోజనం



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు



భోజనం వడ్డిస్తున్న ట్రస్టు కార్యదర్శి సురేఖ

మంచిర్యాలఅర్బన్: పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు జిల్లా కేంద్ర గ్రంథాలయానికి పఠనం కోసం వస్తున్న అభ్యర్థులకు మధ్యాహ్న భోజనం పరీక్షగా మారింది. నిన్నటివరకు అర్ధాకలితో అలమటించిన అభ్యర్థులకు గురువారం ఓ వైపు మున్సిపాలిటీ, ఇంకోవైపు కాంగ్రెస్ పార్టీ పోటాపోటీగా మధ్యాహ్న భోజనం వడ్డించడంతో ఎటు వైపు వెళ్లాలో తెలియక ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. మరికొందరు ఈ విషయం తెలియక టిఫిన్ బాక్స్ వెంట తెచ్చుకున్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిరుద్యోగులకు మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు గురువారం ప్రారంభించారు. కలెక్టర్ బి.సంతోష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రవీణ్, ఎమ్మెల్యే సూచనతో మున్సిపల్ పాలకవర్గం మూడు నెలలపాటు మధ్యాహ్న భోజనం అందించడానికి రూ.15లక్షలు కేటాయించింది. రోజుకు రెండు కూరలు, పప్పు,పెరుగు నాణ్యమైన భోజనం అందించనున్నారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గాంధీపార్కులో..

కొక్కిరాల రఘుపతిరావు చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అభ్యర్థులకు గురువారం గాంధీపార్కులో మధ్యాహ్న భోజనం కార్యక్రమాన్ని ట్రస్టు కార్యదర్శి కొక్కిరాల సురేఖ ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి గ్రంథాలయానికి వచ్చే అభ్యర్థులకు ఉచిత భోజన సదుపాయం అందుబాటులో ఉంటుందని ఆమె ప్రకటించారు.

సమ్మర్ సైన్స్ క్యాంపు సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో నిర్వహిస్తున్న సైన్స్ సమ్మర్‌క్యాంపు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌సీఆర్‌టీ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ సురేష్‌బాబు విద్యార్థులకు సూచించారు. గురువారం జాతీయ టెక్నాలజీ డేను పురస్కరించుకుని డీఈవో యాదయ్యతో కలిసి సైన్స్ కేంద్రాన్ని సందర్శించారు. డీఎస్‌వో మధుబాబు, ఉపాధ్యాయులు జాకీర్‌హుస్సేన్, కుమార్, రాజేశం పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగరేణి కేకే–1 డిస్పెన్సరీ వద్ద గుర్తు తెలియని వృద్ధుడు గురువారం మృతిచెందినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. ఎక్కడి వ్యక్తి అనేది తెలియదని, కొన్ని రోజులుగా డిస్పెన్సరీ వద్ద వెహికిల్ షెడ్డులో ఉంటున్నాడని పేర్కొన్నారు. డిస్పెన్సరీ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 70 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై ఎరుపు, తెలుపు గీతల లుంగీ ఉందని, సంబంధీకులు ఎవరైనా ఉంటే సంప్రదించాలని సూచించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 31వ వార్డులో గురువారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్లు గెల్లి రాజలింగు, కృష్ణ, బీఆర్‌ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

కుంటాల(ముధోల్): పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను చేరవేస్తున్న ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. మండలంలోని కల్లూర్‌లో జాతీయ రహదారిపై గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా కల్లూర్ నుంచి కుంటాలకు వెళ్తున్న ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తుండగా వాహనాన్ని ఆపి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రతిఒక్కరూ రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫ్లెక్సీ షాపులో చోరీ



సీసీ ఫుటేజీలో దొంగలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో రోజురోజుకూ చోరీలు పెరిగిపోతున్నాయి. ఇటీవల అత్యధికంగా ద్విచక్ర వాహనాలు, తాళం వేసి ఉన్న ఇళ్లకు కన్నం వేసిన విషయం విదితమే. తాజాగా గురువారం తెల్లవారు జామున జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల ఐడియా ఫ్లెక్సీ షాపు వెనుక భాగంలో ఇద్దరు చోరీకి పాల్పడ్డారు. షాపులో ఉన్న కూలర్‌తో పాటు సింటెక్ వాటర్ ట్యాంక్‌ను ఎత్తుకెళ్లారు. ఈ దృశ్యాలు సమీపంలోని ఓ సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. గతంలో కూడా బస్టాండ్ ప్రాంతంలో దొంగతనాలు జరిగాయి.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

లోకేశ్వరం(ముధోల్): ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం వట్టోలి గ్రామానికి చెందిన మేత్రి భూమన్న(45) రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా వ్యాధి నయంకాలేదు. దీంతో మనస్థాపానికి గురయ్యాడు. గురువారం ఉదయం చిన్న వట్టోలి ప్రాంతంలో వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య సాగరబాయి, కుమారుడు ఉన్నారు.

నర్స్.. అమ్మ



రోగులకు సేవలు అందిస్తున్న స్టాఫ్ నర్సు (ఫైల్)

- నిస్వార్థ సేవకు వారు ప్రతిరూపం
- ఎన్ని కష్టాలు ఉన్నా.. మోములో చెరగని చిరునవ్వు
- సొంతవారిలా రోగులకు సపర్యలు
- రోగుల ఆలన..పాలన వారి బాధ్యతే
- నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

ఆస్పత్రికి వెళ్లగానే అమ్మలాంటి ఓ ఆత్మీయ పలకరింపు.. ఎంత ఆపదలో ఉన్నా ఏమీ కాదని ధైర్యం చెప్పే స్నేహితురాలు.. మంచంపై కదలలేని వారిని తన వారిగా భావించి సపర్యలు చేసే సేవకురాలు.. వ్యాధి నయమై డిశ్చార్జి అయ్యే వరకూ మానసిక ధైర్యం అందించే కౌన్సిలర్. డాక్టర్ వైద్యం చేసినా.. కుటుంబ సభ్యులుగా రోగులకు మనోధైర్యం అందించేది మాత్రం నర్సులే. నర్సుల సేవలు వెలకట్టలేనివి. వారి రుణం తీర్చుకోలేనిది. కులం, మతం, పేద, ధనిక అని తేడా లేకుండా నిస్వార్థంగా సేవ చేసే వారు. వైద్యుల సలహా మేరకు మందులు ఇస్తారు. అమ్మలా ఆత్మీయత పంచుతారు. ఓ అక్కలా సలహాలిస్తారు. స్నేహితురాలిలా అండగా ఉంటారు. రోగులకు సేవచేయడమే జీవిత పరమార్థంగా భావించి 'లేడీ ఆఫ్ ది ల్యాంప్'గా ఖ్యాతికెక్కిన సేవామూర్తి ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టిన రోజు సందర్భంగా ఏటా మే 12న ప్రపంచ నర్సుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందిస్తున్న ఉమ్మడి జిల్లా నర్సులపై ప్రత్యేక కథనం.

– మంచిర్యాలటౌన్

ఒకేసారి 50 మందికి సేవలు..



బెల్లంపల్లి: సుమారు 14 ఏళ్ల క్రితం బెల్లంపల్లి కన్నాల రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై జరిగిన బస్సు ప్రమాదంలో 50 మంది వరకు ప్రయాణికులు గాయపడ్డారు. ఆరోజు నేను డ్యూటీలో లేను. ఆస్పత్రిలో ఒక్కరే నర్సు ఉండడంతో క్షతగాత్రులకు వైద్యసేవలు అందించడానికి అత్యవసరంగా నన్ను పిలిపించారు. నా సర్వీసులో అంతమందికి సేవలందించడం అదే మొదటిసారి. వారిని ప్రాణాపాయం నుంచి కాపాడిన తీరు ఎప్పటికీ మర్చిపోలేను.

– షీలా, హెడ్‌నర్స్, బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రి

తోబుట్టువులా ధైర్యం చెబుతా..



బెల్లంపల్లి: నర్సింగ్ వృత్తి అంటే నాకు చాలా ఇష్టం. మాఅక్క , చెల్లెలు కూడా ఇదే వృత్తి చేస్తున్నారు. ఆస్పత్రికి ఎంతోమంది గర్భిణులు ప్రసవం కోసం వస్తుంటారు. కొందరికి సర్జరీ చేయాల్సి ఉంటుంది. ఆ సమయంలో అనేకమంది భయపడుతుంటారు. వారికి ఓ తోబుట్టువుగా ధైర్యం చెబుతా. అప్పటి వరకు భయపడిన వారే ఆతర్వాత సర్జరీకి ముందుకువస్తారు.

– ఎలిజబెత్, స్టాఫ్‌నర్స్, ఏరియా ఆస్పత్రి, బెల్లంపల్లి

మర్యాదపూర్వకంగా ఉంటా..



బెల్లంపల్లి: వైద్యసేవల కోసం ఆస్పత్రికి వచ్చే రోగులను చిరునవ్వుతో పలకరిస్తే వారిలో ఆనందం నింపుతుంది. అందుకే రోగులతో మర్యాద పూర్వకంగా ఉంటా. దీంతో బాధతో వచ్చిన రోగులు ఆనందంగా చికిత్స పొందుతారు. డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లే సమయంలో కృతజ్ఞతాపూర్వకంగా నమస్కరించడం చూస్తుంటే ఆనందంగా ఉంటుంది.

– అన్నపూర్ణ, స్టాఫ్‌నర్సు, ఏరియా ఆస్పత్రి, బెల్లంపల్లి

ఆ రోజు మర్చిపోలేను..



చెన్నూర్: గత నెలలో నైట్ డ్యూటీ చేస్తున్న సమయంలో డెలివరీ కేసు వచ్చింది. కేసు కొంచెం క్రిటికల్‌గా ఉండడంతో రెఫర్ చేయకుండా ధైర్యంగా వైద్యురాలు సహాయంతో డెలివరీ చేశాం. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. వృత్తి పరంగా ఎన్నో కాన్పులు చేసినా ఆ కుటుంబ సభ్యుల సంతోషాన్ని చూస్తే చాలా ఆనందం కలిగింది. ఆ రోజు బెస్ట్ డేగా గుర్తిండిపోతుంది.

– అరుణ, నర్సు, సీహెచ్‌సీ, చెన్నూర్

తల్లికి బిడ్డను అందిస్తుంటే..



రెబ్బెన: మా చేతుల మీదుగా డెలివరీ చేసి తల్లికి బిడ్డను అందించే సమయంలో చెప్పలేని సంతోషం అనిపిస్తుంది. అలాంటి అదృష్టం అందరికీ దక్కదు. 27 ఏళ్ల పాటు ఏజెన్సీ ప్రాంతంలోనే సేవలు అందించా. అమాయక గిరిజనులకు సేవ చేస్తుంటే చెప్పలేని ఆనందంగా ఉంటుంది. ఆ సంతృప్తి మరెక్కడా లభించదు.

– సాజిదాబాను స్టాఫ్‌నర్స్, రెబ్బెన పీహెచ్‌సీ

ప్రశంసపత్రం అందుకున్నా..



మంచిర్యాలటౌన్: నేను 2001లో నర్సు ఉద్యోగంలో చేరా. ఆస్పత్రిలో చేరిన రోగులకు వైద్యసేవలు అందించి ఆరోగ్యంగా తిరిగి వెళ్లేలా చూస్తాం. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలకు సేవలు అందించే అవకాశం రావడం ఆనందంగా ఉంది. కలెక్టర్ చేతుల మీదుగా బెస్ట్ స్టాఫ్‌నర్సుగా ప్రశంస పత్రం అందుకున్నా.

– మంజుకుమారి, స్టాఫ్‌నర్సు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మంచిర్యాల

పేదలకు సేవచేయాలనే..



రెబ్బెన: పేద ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో నర్సింగ్ విద్యను అభ్యసించా. రెబ్బెన పీహెచ్‌సీలో స్టాఫ్ నర్స్‌గా విధులు నిర్వహిస్తున్నా. కొన్ని సందర్భాల్లో గంటల తరబడి డెలివరీ చేయాల్సి వస్తుంది. పుట్టిన బిడ్డను చూడగానే అప్పటి వరకు పడిన కష్టం మర్చిపోతాం.

– రజిత మాధురి, స్టాఫ్‌నర్స్, రెబ్బెన పీహెచ్‌సీ

ఆనందంగా ఉంది



మంచిర్యాలటౌన్: 2011లో విధుల్లో చేరా. ఆదిలాబాద్ రిమ్స్‌లో ఉద్యోగం చేస్తున్న సమయంలో బెస్ట్ నర్సుగా పలుమార్లు ప్రశంస పత్రాలు అందుకోవడం ఆనందంగా ఉంది. ఏడాది నుంచి మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్నా.

– ఉమ, స్టాఫ్‌నర్సు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మంచిర్యాల

నర్సింగ్ ఆఫీసర్లుగా గుర్తింపు...

ప్రజలకు వైద్య సేవలందిస్తున్న నర్సులను కేంద్ర ప్రభుత్వం ఇటీవలే నర్సింగ్ ఆఫీసర్లుగా గుర్తించింది. నర్సింగ్ ఆఫీసర్లుగా పిలవాలని సూచించింది. దీంతో వారికి ప్రజల్లో గౌరవ హోదా లభించింది.

సేవలు చేస్తేనే గుర్తింపు



ఆసిఫాబాద్‌అర్బన్: ఏ వృత్తిలోనైనా బాధ్యతతో విధులు నిర్వహిస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుంది. 2010లో విధులో చేరా. మారుమూల ప్రాంతాల పీహెచ్‌సీల్లోని ప్రజలకు సేవలు అందించడం తృప్తినిచ్చింది. కోవిడ్ బాధితులకు సేవలు అందించడం మర్చిపోలేని గొప్ప అనుభూతినిచ్చింది.

– సంధ్య, స్టాఫ్‌నర్స్, ఆసిఫాబాద్

పారితోషికాలు ఇవ్వాలి



ఆసిఫాబాద్‌అర్బన్: రాత్రింబవళ్లు ఆస్పత్రుల్లో నర్సులు రోగులకు సేవలు అందిస్తారు. అలాంటి వారికి ప్రభుత్వం పారితోషికాలు అందించాలి. పలు సందర్భాల్లో ఆస్పత్రికి వచ్చే వారు మద్యం మత్తులో ఇష్టారాజ్యంగా మాట్లాడినా ఓపికతో సర్దిచెప్పి చికిత్స చేసి పంపిస్తాం. ఈ వృత్తిలో ఓపిక ఎంతో అవసరం.

– గౌసియాబేగం, హెడ్‌నర్స్

అదృష్టంగా భావిస్తున్నా



కౌటాల: కౌటాల పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సుగా సేవలు అందిస్తున్నా. గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించడాన్ని ప్రభుత్వం గుర్తించింది. గతేడాది హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో నిర్వహించిన నర్సుడే వేడుకల్లో మంత్రి హరీశ్‌రావు శాలువాతో సత్కరించి ప్రశంసపత్రం అందించారు. నర్సు వృత్తిలో సేవచేయడం అదృష్టంగా భావిస్తున్నా.

– దుర్గం వర్ష, స్టాఫ్‌నర్సు, కౌటాల

16 ఏళ్లుగా వైద్యసేవలు



కౌటాల: కౌటాల పీహెచ్‌సీలో పదేళ్లుగా నర్సుగా సేవలందిస్తున్నా. వైద్యుల సహకారంతో రాష్ట్రంలోనే ఎక్కువగా కౌటాల పీహెచ్‌సీలో సాధారణ కాన్పులు చేస్తున్నాం. ఇటీవల కేంద్ర వైద్య క్వాలిటీ బృందం మాసేవలను గుర్తించడం సంతోషంగా ఉంది. ఉత్తమ వైద్యసేవలు అందిస్తున్నప్పటికీ విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఆరోపించినప్పుడు బాధగా ఉంటుంది.

– కె.సునీత, స్టాఫ్ నర్సు, కౌటాల

ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణకు డీడీ కట్టాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్

రామకృష్ణాపూర్(చెన్నూర్): సింగరేణి స్థలాల్లో ఇండ్లు నిర్మించుకుని పట్టాలు పొందగోరే ప్రతిఒక్కరూ వెంటనే డీడీలు చెల్లించి పట్టాలు పొందాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. గురువారం క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. జీవో 76కు సంబంధించి సింగరేణి స్థలాల్లో ఇండ్లు నిర్మించుకున్న వారు ఇంకా 450 మంది వరకు డీడీలు కట్టాల్సి ఉందన్నారు. వీరంతా మరో వారం రోజుల్లోగా డీడీలు చెల్లించేలా వార్డు కౌన్సిలర్లు, ఆర్పీలు చొరవ తీసుకోవాలన్నారు. అవసరమైతే ఇంటింటికీ వెళ్లి డీడీలు కట్టేలా చూడాలన్నారు. 2014 కన్నా ముందు సింగరేణి స్థలాల్లో ఇండ్లు కట్టుకున్న వారికే పట్టాల కోసం అవకాశముండగా ప్రభుత్వం దానిని సవరిస్తూ 2020 వరకు పొడిగించిందన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్, మంచిర్యాల ఆర్డీవో వేణు, మందమర్రి తహసీల్దార్ సంపతి శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, కమిషనర్ వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

బెల్లంపల్లి: ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఇళ్ల క్రమబద్ధీకరణపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఆర్డీవో శ్యామలాదేవి , మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ సమ్మయ్య, తహసీల్దార్ మధుసూదన్ పాల్గొన్నారు.

వైద్య సేవలు మెరుగుపర్చాలి



జిల్లా వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు మరింత మెరుగు పర్చాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ గర్భిణుల నమోదు చేయాలని, పరీక్షలు పెంచాలని, రక్తహీనత కేసుల వివరాలను ఎప్పటికప్పుడు రిపోర్టు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్వేత, అపర్ణ, స్టాఫ్‌నర్సులు వరలక్ష్మీ, పుష్పలత, డెమో బుక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

మంచిర్యాలటౌన్: అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోజువారీగా నిర్వహించే కార్యక్రమాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఆఫ్‌లైన్‌లో సమీక్షించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం వైద్యులు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఓపీ విధుల కోసం సమయాన్ని కేటాయించడంతోపాటు ఆ రోజు జరిగిన అన్ని ఆరోగ్య కార్యక్రమాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. సాధారణ ప్రసవాలు పెంచేలా గర్భిణులను సంసిద్ధం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు విజయపూర్ణిమ, నీరజ, అనిత పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ సేవలు మరింత మెరుగు

శ్రీరాంపూర్(మంచిర్యాల): సీఎంపీఎఫ్ సేవలు మరింత మెరుగుపరిచినట్లు ఆ శాఖ గోదావరిఖని రీజియన్ కమిషనర్ హరిపచౌరీ తెలిపారు. గురువారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో డీజీఎం(పర్సనల్) అరవిందరావు అధ్యక్షతన సీఎంపీఎఫ్ ట్రైపార్ట్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన హరిపచౌరీ సీఎంపీఎఫ్‌లో కొత్త నామినేషన్స్, సెటిల్మెంట్లకు సంబంధించిన వాటిపై అవగాహన కల్పించారు. పర్సనల్, అకౌంట్ డిపార్టుమెంట్ వారు కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించిన సీఎంపీఎఫ్ పత్రాలను ఎప్పటికప్పుడు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏజెంట్ ఏవీరెడ్డి, డీవైపీఎం దేవేందర్‌రెడ్డి, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ హరిపచౌరీ

మెరుగైన వేతన ఒప్పందం సాధిస్తాం

- బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఈ నెల 19న కోల్‌కత్తాలో నిర్వహించనున్న 11వ వేజ్‌బోర్డు సమావేశంలో కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం సాధిస్తామని బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్ అన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో కార్మికులతో మాట్లాడారు. వేజ్‌బోర్డు సమావేశాలు సజావుగా జరగడం బీఎంఎస్ కృషి ఫలితమే అన్నారు. గత ఆర్థిక సంవత్సరం కంపెనీ సాధించిన వాస్తవ లాభాలను ప్రకటించి కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో సేఫ్టీ ట్రైపార్టీయేట్ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21, 22 తేదీల్లో ధన్‌బాద్‌లోని డీజీఎంఎస్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర కమిటీ సభ్యులు కాదాసి భీమయ్య, పీ.వినోద్‌కుమార్, నాయకులు సత్తయ్య, పిట్ సెక్రెటరీ ఆనంద్, నరేశ్, గోపు సందీప్, శ్రీనివాస్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పేరం రమేశ్

రేషన్ డీలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోండి

బెల్లంపల్లి: బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ షాపుల డీలర్‌షిప్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బెల్లంపల్లి ఆర్డీవో కె.శ్యామలాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ 19, 20 వార్డుల పరిధి అశోక్‌నగర్‌లో (ఓసీ), బెల్లంపల్లి మండలం మాలగురిజాలలో (ఎస్సీ), భీమిని మండలం కేస్లాపూర్‌లో (ఎస్టీ–మహిళ), రాంపూర్ (ఎస్సీ), వీగాం (ఎస్టీ), కాసిపేట మండలం ముత్యంపల్లి (బీసీ–బీ), కన్నెపల్లి మండలం పోలంపల్లి (ఎస్సీ–మహిళ), టేకులపల్లి (ఓసీ–మహిళ) , నెన్నెల మండలం చిత్తాపూర్(ఓసీ–మహిళ) ఖాళీగా ఉన్నాయని, వాటిని ఆయా సామాజిక వర్గాల వారికి రిజర్వు చేశామన్నారు. తాండూర్ మండలం బోయపల్లి (ఎస్టీ–మహిళ), చౌటపల్లి (ఓసీ), రేచినీ (ఓసీ), ద్వారకాపూర్ (ఓసీ–మహిళ), అచ్చులాపూర్ (ఎస్సీ)లకు కేటాయించినట్లు తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 15 నుంచి 31 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆమె తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. దరఖాస్తుతోపాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను అంటించి సంబంధిత తహసీల్దార్ సంతకంతో ధృవీకరించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుతో పాటు నివాసం, కులం, పుట్టిన తేదీ, విద్యార్హత ధృవీకరణ పత్రాలను జత చేయాలన్నారు. రాతపరీక్షలో నెగ్గిన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకోసం బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

'తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే'



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వివేక్



బెల్లంపల్లిలో మోటారు సైకిల్ ర్యాలీలో పాల్గొన్న వివేక్, బీజేపీ శ్రేణులు

బెల్లంపల్లి/తాండూర్: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ గడ్డం వివేక్ అన్నారు. గురువారం ఆయన బెల్లంపల్లి రైల్వే స్టేషన్ వద్ద బీజేపీ జెండా ఎగురవేశారు. తాండూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అవినీతి, నియంతృత్వ పాలనకు ప్రజలు పాతరేయాలని పిలుపునిచ్చారు. తాండూర్, బెల్లంపల్లిలో మోటార్‌సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. తాండూర్‌లో వీఓఏల సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శులు మునిమంద రమేష్, శ్రీనివాస్, నాయకులు ఏమాజీ, కె.రమేష్, తిరుపతి, రాజనర్సు, విజయ్, ఎం.శ్రీనివాస్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి జైలు

మంచిర్యాలక్రైం: శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బస్టాండ్ వద్ద 2015 ఫిబ్రవరి 22న ఓ వ్యక్తిపై హత్యాయత్నం చేసిన ముగ్గురికి నాలుగేళ్ల జైలు, రూ.1500 చొప్పున జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జీ.ఉదయ్‌కుమార్ గురువారం తీర్పునిచ్చారు. జైపూర్ మండలం నర్సింగపూర్ గ్రామానికి చెందిన పండుగు రాజన్న, వేముల రవీందర్‌గౌడ్, తోకల సాగర్ అల్లర్లకు పాల్పడుతుండడంతో అదే గ్రామానికి చెందిన బోయిని రాజేందర్, మరి కొందరు కలిసి నిలదీశారు. దీంతో రాజేందర్‌పై కక్షగట్టి హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. 2015 ఫిబ్రవరి 22న రాజేందర్, శ్రీకాంత్ ద్విచక్ర వాహనంపై మంచిర్యాలకు వెళ్లి వస్తుండగా శ్రీరాపూర్ బస్టాండ్ వద్ద వారిని అడ్డుకుని రాడ్లు, కర్రలతో దాడిచేయడంతో రాజేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయమై శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై టీ.సంజీవ్ (ప్రస్తుతం మంచిర్యాల రూరల్ సీఐ) కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. కోర్టు లైసన్ ఆఫీసర్ కే.శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ గులామ్ ధస్తాగిర్ సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మదన్‌మోహన్‌రావ్ నేరం రుజువు చేయడంతో నిందితులకు నాలుగేళ్ల జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు. మండలంలోని హర్కపూర్‌తాండకు చెందిన జాదవ్ నాందేవ్ (47)వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా షుగర్, బీపీతో బాధపడుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. కుటుంబ పోషణ భారం కావడమే కాకుండా కూతురికి వివాహం చేసేదెలా? అని మనస్థాపానికి గురయ్యాడు. గురువారం తెల్లవారుజామున ఇంట్లోనే దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సునీల్ గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య అరుణ, కుమారుడు కిరణ్‌కుమార్, కూతురు అర్చన ఉన్నారు.